సాక్షి
కామారెడ్డి
గురువారం। 26। జనవరి। 2023




### రుణాలు దక్కేదెవరికో?

జిల్లాలో మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు తీవ్ర పోటీ ఉంది. ఒక్కో యూనిట్‌కు 50 మంది పోటీపడుతున్నారు.
- 10లో ▸



### తవ్వేది కొండంత..

బాన్సువాడ ప్రాంతంలో ఇష్టారీతిన మొరం తవ్వకాలు సాగిస్తున్నారు. గుట్టలను మాయం చేస్తున్నారు.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
34.8 /17.5

### వాతావరణం

పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. చలి తీవ్రత తగ్గుతుంది.

## న్యూస్‌రీల్

### 'పరిశోధనల కేంద్రంగా మార్చుతాం'



భిక్కనూరు: భిక్కనూరులోని తెలంగాణ యూనివర్సిటీ సౌత్‌క్యాంపస్‌ను పరిశోధనల కేంద్రంగా మార్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని వర్సిటీ వైస్ చాన్స్‌లర్ రవీందర్‌గుప్తా పేర్కొన్నారు. బుధవారం ఆయన సౌత్‌క్యాంపస్‌లో సోషల్‌వర్క్ డిపార్టుమెంట్ కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ వర్క్ విద్యార్థులు సమాజంతో మమేకమై సేవా దృక్పథంతో ముందుకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ విద్యావర్ధిని, మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ అధికారులు శరత్‌చంద్ర, నవీన్‌కుమార్, ప్రిన్సిపాల్ లావణ్య అధ్యాపకులు వీరభద్రం, అంజయ్య, రాజేశ్వరి, జమీల్‌హైమద్, యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, ఏపీఆర్‌వో యాలాద్రి తదితరులు పాల్గొన్నారు. సౌత్‌క్యాంపస్‌లో నిర్వహించిన ఓటర్ల దినోత్సవంలో రిజిస్ట్రార్ విద్యావర్ధినితోపాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### 'యాత్రను విజయవంతం చేయాలి'



దోమకొండ: భారత్ జోడో యాత్రకు అనుసంధానంగా జిల్లాలో గురువారం నుంచి చేపట్టే యాత్రను పార్టీ కార్యకర్తలు విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్ కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రాహుల్‌గాంధీ చేట్టిన భారత్‌జోడో యాత్ర ఈనెల 30వ తేదీన కాశ్మీర్‌లో ముగుస్తుందన్నారు. భారత్‌జోడో అనుసంధాన యాత్ర రెండు నెలల పాటు సాగుతుందన్నారు. అన్ని గ్రామాల మీదుగా యాత్ర ఉంటుందని, పార్టీ శ్రేణులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు సీతారాం మధు, ముత్యంపేట శ్రీను, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డంపింగ్ యార్డు ఆక్రమణపై ఆగ్రహం



భిక్కనూరు: జంగంపల్లి డంపింగ్ యార్డు స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై డీపీవో శ్రీనివాస్‌రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మూడేళ్ల క్రితం నిర్మించిన డంపింగ్ యార్డు చుట్టు పక్కల ప్రాంతంలో కొందరు వ్యక్తులు బుధవారం యంత్రాలతో చదును చేస్తుండగా ఎంపీవో ప్రవీణ్‌కుమార్ పనులను అడ్డుకోవడానికి యత్నించారు. ఆ స్థలాన్ని కొనుగోలు చేసి నట్లు సదరు వ్యక్తులు ఎంపీవోతో పేర్కొన్నారు. దీంతో ఆయన ఈ విషయాన్ని డీపీవో శ్రీనివాస్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. డీపీవో, డీఎల్‌పీవో సాయిబాబా, తహసీల్దార్ ప్రేమ్ కుమార్, సర్పంచ్ నర్సింలు యాదవ్ అక్కడికి చేరుకొని పనులు నిలిపివేయాలని, లేకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలం అని చూపిన ప్రాంతంలోనే డంపింగ్ యార్డు నిర్మించినట్లు సర్పంచ్ వివరించారు. సర్వే చేయాలని తహసీల్దార్‌కు డీపీవో సూచించారు.

### నాందేడ్‌లో బీఆర్‌ఎస్ సభ కోసం స్థల పరిశీలన



నిజాంసాగర్: మహారాష్ట్రలోని నాందేడ్‌లో వచ్చే నెల 5న సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ సభ నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే అక్కడికి వెళ్లి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం నాందేడ్ మాజీ ఎంపీ కుబ్‌దేవ్‌ను కలిసి జన సమీకరణపై చర్చించారు.

# సిరుల సేద్యం..!

సాగు మడిలో అన్నదాతలు అద్భుతాలు సృష్టిస్తున్నారు. సాగునీటి కష్టాలను అధిగమించి మంచి దిగుబడులు సాధిస్తున్నారు. వరి దిగుబడిలో రాష్ట్రంలో అగ్రస్థానాన్ని దక్కించుకున్న జిల్లా రైతులు.. మక్క, శనగ సాగులోనూ ముందుండి ఔరా అనిపించుకుంటున్నారు.



- వరి దిగుబడిలో రాష్ట్రంలో అగ్రస్థానం
- మక్క, శనగ సాగూ ఎక్కువే...
- రాష్ట్ర గణాంక నివేదికలో వెల్లడి

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టుల ఆయకట్టు కింద ఎక్కువ విస్తీర్ణంలో వరి సాగవుతోంది. బోర్లు, బావుల వద్ద వరే వేస్తున్నారు. వర్షాధారంగా మక్క, ఇతర పంటలు సాగు చేస్తారు. యాసంగిలో బోర్లు, బావుల వద్ద మక్క ఎక్కువగా వేస్తారు. 2021–22 సంవత్సరానికి సంబంధించి తెలంగాణ రాష్ట్ర గణాంక నివేదికను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగు చేయడంతో పాటు అధిక దిగుబడులు సాధించి కామారెడ్డి జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. రైతులు ఆరుగాలం శ్రమించడం ద్వారా అధిక దిగుబడులు సాధిస్తున్నారని నివేదిక ద్వారా స్పష్టమవుతోంది.

**ఖరీఫ్‌ను మించి రబీలో..**

2021–22 ఖరీఫ్ సీజన్‌లో జిల్లాలో 2,81,069 ఎకరాల్లో వరి పంట సాగయ్యింది. 6,48,341 టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఎకరాకు సరాసరిన 23.07 క్వింటాళ్ల దిగుబడి సాధించి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచింది. యాసంగిలో 1,54,016 ఎకరాల్లో వరి పంట సాగవగా.. 4,04,197 టన్నుల ధాన్యం ఉత్పత్తి అయ్యింది. ఎకరాకు 26.24 క్వింటాళ్ల దిగుబడి సాధించి యాసంగిలోనూ అగ్రస్థానం పొందింది. వానాకాలం సీజన్‌ను మించి యాసంగిలో దిగుబడులు రావడం గమనార్హం.

**శనగలోనూ అగ్రస్థానం..**

2021–22 సంవత్సరంలో శనగ పంట సాగు విస్తీర్ణంతో పాటు ఉత్పత్తిలోనూ కామారెడ్డి జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. జిల్లాలో 1,02,447 ఎకరాల్లో శనగ పంట సాగవగా 58,913 టన్నుల దిగుబడి వచ్చింది. సరాసరిన ఎకరాకు 5.75 క్వింటాళ్ల శనగలు పండాయి.

**సోయా పరవాలేదు**

జిల్లాలో సోయా పంట సాగు కూడా బాగానే ఉంది. రాష్ట్రంలో సోయా సాగు విస్తీర్ణంలో కామారెడ్డి జిల్లా మూడో స్థానంలో ఉంది. 2021 –22 వర్షాకాలం సీజన్‌లో 71,131 ఎకరాల్లో సోయా పంట సాగవగా.. 51,727 టన్నుల పంట వచ్చింది. ఎకరాకు సరాసరిగా 7.27 క్వింటాళ్ల దిగుబడితో జిల్లా మూడో స్థానంలో నిలిచింది. కంది, ఇతర పప్పుదినుసులు కూడా జిల్లాలో ఎక్కువగానే సాగవుతున్నాయి. కూరగాయల సాగు కూడా బాగుంది. జిల్లాకు అవసరమయ్యే కూరగాయల్లో దాదాపు సగం స్థానికంగానే పండుతున్నాయి.

### మక్క సాగూ ఎక్కువే

2021–22 వానాకాలం సీజన్‌లో రాష్ట్రంలోనే అత్యధిక విస్తీర్ణంలో కామారెడ్డి జిల్లాలో మక్క సాగైంది. జిల్లాలో 92,177 ఎకరాల్లో మక్క వేశారు. 2,07,559 టన్నుల మక్క ఉత్పత్తి అయ్యింది. ఎకరాకు 22.52 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడుల్లోనూ జిల్లా అగ్రస్థానంలో నిలిచింది. యాసంగిలో 40,167 ఎకరాల్లో మక్క వేశారు. ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణంలో జిల్లా ఐదో స్థానంలో నిలిచింది. 1,10,206 టన్నుల దిగుబడి వచ్చింది. రెండు సీజన్‌లు కలిపి 1,32,344 ఎకరాల్లో మక్క సాగవ్వగా.. 3,17,765 టన్నుల మక్కలు ఉత్పత్తి అయ్యాయి. రెండు సీజన్‌లకు కలిపి సాగు విస్తీర్ణంలో జిల్లా రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది.





గణతంత్ర దినోత్సవాలకు ముస్తాబైన కలెక్టరేట్ భవనం

### కలెక్టరేట్‌లో రిపబ్లిక్ డే

కామారెడ్డి టౌన్: కలెక్టరేట్‌లో గురువారం గణతంత్ర దినోత్సవాలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు ఈ వేడుకల్లో పాల్గొనాలని కలెక్టర్ కోరారు. కాగా ఏటా జిల్లాకేంద్రంలోని ఇందిరాగాంధీ స్టేడియంలో గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. ఈసారి ఇందిరాగాంధీ స్టేడియంలో కాకుండా కలెక్టరేట్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. ఉత్సవాల కోసం కలెక్టరేట్‌ను ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో భవనాన్ని అలంకరించారు.

## 'ఆధునిక పద్ధతులు అవలంబించాలి'

కామారెడ్డి రూరల్: పాల ఉత్పత్తిని పెంచడానికి పశుపోషణలో ఆధునిక పద్ధతులు అవలంబించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పాడి రైతులకు సూచించారు. బుధవారం క్యాసంపల్లిలో పశు వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ రైతులు పాలు పితికే యంత్రాలను ఉపయోగించాలని సూచించారు. కోరుట్ల వెటర్నరీ కళాశాలకు చెందిన 64 మంది ఫైనల్ ఇయర్ విద్యార్థులు క్షేత్ర పర్యటనలో భాగంగా జిల్లాలో ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని జిల్లా పశువైద్యాధికారి భరత్ తెలిపారు. 31 వ తేదీవరకు పది మండలాల్లో 18 వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తారన్నారు. ఈ శిబిరాలలో గేదెలకు గర్భకోశ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసి, అవసరమైనవాటికి చికిత్స లు అందిస్తామన్నారు. దూడలకు నట్టల నివారణ మందు వేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ పీవీ నర్సింహారావు వెటర్నరీ యూనివర్సిటీ డీన్ చిన్ని ప్రీతం, విజయ డెయిరీ డిప్యూటీ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, కోరుట్ల వెటర్నరీ కళాశాల డీన్ మాధవరావు, కామారెడ్డి వెటర్నరీ కళాశాల డీన్ శరత్‌చంద్ర, సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు బాలకిషన్‌గౌడ్, రాజిరెడ్డి, రాజయ్య, పశువైద్యులు కృష్ణ, అరుణకుమారి, నాగరాజు, దేవేందర్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



నట్టల మందు పంపిణీని పరిశీలిస్తున్న కలెక్టర్

### 5,485 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో బుధవారం 44 శిబిరాలలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగింది. 5,485 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1,194 మందికి కంటి అద్దాలను అందించారు. ఇప్పటివరకు జిల్లాలో 226 శిబిరాలు నిర్వహించామని అధికారులు తెలిపారు. మొత్తం 26,691 మందికి కంటి పరీక్షలు చేసి, 6,288 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని పేర్కొన్నారు.

## 'మహిళా సంక్షేమాన్ని విస్మరిస్తున్న రాష్ట్రం'

కామారెడ్డి రూరల్: మహిళల కోసం గతంలో ప్రవేశపెట్టిన వడ్డీలేని రుణాలు, అభయ హస్తం తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం నీరుగారుస్తోందని బీజేపీ కామారెడ్డి నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి విమర్శించారు. వాటిని సాధించుకోవడానికి ఈనెల 30 నుంచి ఆందోళనలు చేయనున్నట్లు ప్రకటించారు. బుధవారం ఆయన చిన్నమల్లారెడ్డిలో మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వడ్డీ లేని రుణాలకు సంబంధించిన రాయితీని ప్రభుత్వం నాలుగేళ్లుగా మహిళా సంఘాలకు ఇవ్వడం లేదన్నారు. అభయ హస్తం పథకాన్ని నిలిపివేశారని, ఈ పథకం కింద ఆడపడుచులు కట్టిన డబ్బులు కూడా తిరిగి ఇవ్వడం లేదని పేర్కొన్నారు. వడ్డీ రాయితీ సొమ్ముకోసం అభయహస్తం అమలు కోసం ఈనెల 30న మహిళా సంఘాలతో ఉద్యమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరమణారెడ్డి

## 'లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి'

కామారెడ్డి క్రైం: లోక్ అదాలత్ ద్వారా ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జి శ్రీదేవి పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని కోర్టులో బుధవారం కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో కలిసి జాతీయ లోక్ అదాలత్ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏళ్ల తరబడి వివాదంలో ఉన్న రెవెన్యూ, కుటుంబ సమస్యలను లోక్ అదాలత్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు.

**కంటి వెలుగు శిబిరం..**

కామారెడ్డి పోక్సో కోర్టు భవనంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం కంటి వెలుగు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ప్రారంభించారు. న్యాయవాదులు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా జడ్జి శ్రీదేవికి కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమాలలో జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్‌సింగ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వైద్య అమృత్‌రావు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పనులను పూర్తిచేయండి**

రామారెడ్డి: 'మన ఊరు –మన బడి' పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. బుధవారం ఆయన ఇసన్నపల్లి, అన్నారం గ్రామాలలో మొదటి విడత 'మన ఊరు –మన బడి' పనులను పరిశీలించారు. ఇసన్నపల్లిలో పెండింగ్‌లో ఉన్న కిచెన్ షెడ్ పనులను త్వరలో పూర్తి చేస్తానని సర్పంచ్ బాలమణి తెలిపారు. అన్నారంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని ప్రజాప్రతినిధులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయ్‌కుమార్, ఎంఈవో యోసెఫ్, హెచ్‌ఎం బాలకిషన్, నాయకులు లింబాద్రి, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జిల్లా జడ్జి శ్రీదేవి, కలెక్టర్ పాటిల్

## 'ఉన్నత శిఖరాలకు చేరాలి'

పిట్లం: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. బుధవారం చిన్నకొడప్‌గల్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో హైవే అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన 47 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గ్రామాలనుంచి జాతీయ రహదారిపైకి వచ్చేప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పీడీ మధుసూదన్‌రావ్, ఇంజినీర్‌లు బలరాం, విజయరావ్, క్యూబ్ హైవే వైస్ ప్రెసిడెంట్ వసుంధర, ప్రాజెక్ట్ హెడ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు చెక్కులను అందిస్తున్న ఎస్పీ

### ఓటు వజ్రాయుధం లాంటిది

- అర్హులందరూ ఓటు హక్కు పొందాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఓటు వజ్రాయుధం లాంటిదని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 ఏళ్ల నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కొత్త ఓటర్లు తమ అభిప్రాయాలను తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్, దివ్యాంగ ఓటర్లను సన్మానించారు. కొత్త ఓటర్లకు గుర్తింపు కార్డులను అందించారు. సమావేశంలో, అడిషనల్ ఎస్పీ అన్యోన్య, శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఆర్డీవో శ్రీనివాసరెడ్డి, జిల్లా ఎన్నికల పర్యవేక్షకుడు సాయిభుజంగరావు, ఏవో రవీందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య, వైస్ ప్రిన్సిపల్ చంద్రకాంత్, తెలుగు ప్రొఫెసర్ శంకర్, తహసీల్దార్ వెంకట్‌రావు, ఎన్నికల విభాగం అధికారులు నరేందర్, శ్రావణి, ఇంద్రప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌జెండర్లను సన్మానించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఏఎస్పీ అన్యోన్య

# పత్తి రైతుకు ధరాఘాతం

- సీజన్ ప్రారంభంలో ఊరించిన ధర
- పంట చేతికొచ్చాక తగ్గుతున్న వైనం
- ఆందోళనలో రైతాంగం
- నిల్వ చేసుకునేందుకే మొగ్గు

మార్కెట్‌లో పత్తి ధర స్థిరంగా ఉండడం లేదు. సీజన్ ప్రారంభంలో మంచి ధరే పలికినా.. పంట చేతికొచ్చాక పడిపోతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అగ్గువకు అమ్ముకోలేక.. నిల్వ చేసుకుని ధర పెరిగాక అమ్ముకునేందుకే మొగ్గు చూపుతున్నారు. దీంతో మద్నూర్‌లోని పత్తి మార్కెట్ వెలవెలబోతోంది.

మద్నూర్: జిల్లాలో ఈ ఏడాది 28,340 ఎకరాల్లో పత్తి సాగయ్యింది. వర్షాకాలంలో భారీ వర్షాలు కురియడంతో పంట ఎదుగుదలపై ప్రభావం పడింది. మరోవైపు తెగుళ్లతో ఆశించిన స్థాయిలో దిగుబడులు రాలేదు. ఎకరానికి మూడు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడే వచ్చిందని రైతులు పేర్కొంటున్నారు. అయితే సీజన్ ప్రారంభంలో మంచి ధర లభించింది. క్వింటాలుకు రూ. 9,500 పైనే పలికింది. పంట చేతికొచ్చాక ధర తగ్గడం ప్రారంభమైంది. ప్రస్తుతం మద్నూర్ మార్కెట్‌లో పత్తి ధర క్వింటాలుకు రూ. 7,900 నుంచి రూ. 8,200 మధ్యలో ఊగిసలాడుతోంది.

**ఇళ్లలోనే నిల్వ**

పత్తి ధరలు రైతులను అయోమయానికి గురిచేస్తున్నాయి. ప్రస్తుతం మంచి ధర లభించకపోవడంతో రైతులు పంటను అమ్ముకునే విషయంలో వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక వ్యాపారులు, పత్తి ఫ్యాక్టరీల యజమానులు మార్కెట్‌లో నిర్వహిస్తున్న బీట్‌లలో పాల్గొని కావాలనే ధరలను తగ్గిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. వర్షాకాలంలో కురిసిన అధిక వర్షాల కారణంగా దేశీయంగా పత్తి సాగు విస్తీర్ణంతోపాటు దిగుబడులు తగ్గడం, వరదలతో అంతర్జాతీయంగానూ దిగుబడులు తగ్గిన నేపథ్యంలో భవిష్యత్‌లో ధర పెరగవచ్చని భావిస్తున్నారు. వ్యాపారులు సైతం పత్తి నిల్వ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అంతేగాక గతేడాది రైతుల నుంచి చాలావరకు పత్తి అమ్మకాలు జరిగిన తర్వాత ధర పెరిగింది. ఈసారి కూడా అలాగే జరిగే అవకాశాలున్నాయని నమ్ముతున్న రైతులు పంటను ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. ధర పెరిగిన తర్వాత అమ్ముకుందామన్న ఆలోచనలో చాలామంది రైతులు ఉన్నారు.

### మార్కెట్ వెలవెల

జిల్లాలో పత్తి మార్కెట్ ఒక్క మద్నూర్‌లోనే ఉంది. ఇక్కడ రెండు నెలల క్రితం పత్తి కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ప్రారంభంలో క్వింటాలుకు రూ. 9,500 ధర లభించింది. రానురాను తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం రూ. 8,200 పలుకుతోంది. మార్కెట్‌లో ఆశించిన ధర లభించకపోవడంతో రైతులు ఇటువైపు చూడడం లేదు. గతేడాది ఇదే సమయంలో మద్నూర్ మార్కెట్‌లో 2.50 లక్షల క్వింటాళ్ల పత్తిని సేకరించారు. ఈసారి ధర లేకపోవడంతో రైతులు మార్కెట్‌కు పంటను తీసుకురావడం లేదు. దీంతో ఇప్పటివరకు 51,932 క్వింటాళ్ల పత్తే మార్కెట్‌కు వచ్చింది. మార్కెట్‌కు పత్తి రాకపోవడంతో జిన్నింగ్ మిల్లులు కూడా వెలవెలబోతున్నాయి.



పత్తి రాకపోవడంతో ఖాళీగా ఉన్న మద్నూర్ పత్తి మార్కెట్

## క్లుప్తంగా

### షుగర్స్ ఫ్యాక్టరీ సిబ్బంది నిర్బంధం



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలకేంద్రంలో బుధవారం అడ్లూర్ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ సిబ్బందిని స్థానిక రైతులు నిర్బంధించారు. ఫీల్డ్‌మెన్‌లు, ఫీల్డ్ ఆఫీసర్ల చేతులు తడపనిదే ఫ్యాక్టరీకి చెరుకును తరలించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యాలయానికి తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ముందు వేసిన చెరుకును కాకుండా వెనక వేసిన చెరుకును తరలించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. నిబంధనలు ప్రకారం చెరుకును ఫ్యాక్టరీకి తరలించాలన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి రైతులతో మాట్లాడారు. వారిని సముదాయించి, సిబ్బందిని విడిపించారు.

### ప్రజాస్వామ్య దేశంలో ఓటు కీలకం



తెయూ(డిచ్‌పల్లి): ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు కీలకమని, సరైన అభ్యర్థిని ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు కల్పిస్తుందని తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ అన్నారు. బుధవారం తెయూ కంప్యూటర్ సైన్స్ కాలేజ్ భవనంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ -1, 2, 3, 4 సంయుక్త ఆధ్వర్యంలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ఆరతి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ప్రొగ్రాం ఆఫీసర్స్ మహేందర్, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపాలి



డిచ్‌పల్లి: పది రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరంలో ట్రైనర్స్ నేర్పించే నూతన మెలకువలను చక్కగా నేర్చుకుని జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్‌బాబు సూచించారు. సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడా మైదానంలో బుధవారం రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ ప్రాబబుల్స్ జట్టుకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ శిబిరంలో ప్రతిభ చూపిన వారిని తుది జట్టుకు ఎంపిక చేస్తారని తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 5 నుంచి 9 వరకు ఒడిశాలో జరిగే జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపల్ గోదావరి, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి అభిషేక్‌గౌడ్ పాల్గొన్నారు.

# అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత..

- ఇష్టారీతిన మొరం తవ్వకాలు
- మాయమవుతున్న కుంటలు, గుట్టలు
- పట్టించుకోని అధికారులు



కుంటలో వేసిన మొరం



బోర్లం శివారులో గుట్టలను తవ్వుతున్న పొక్లెయిన్లు

బాన్సువాడ టౌన్: పలువురు అక్రమార్కులు అక్రమార్జనే ధ్యేయంగా యంత్రాలతో ప్రకృతి సంపదను కొల్లకొడుతున్నారు. దీంతో ప్రకృతికి నిలయాలుగా ఉన్న గుట్టలు, కుంటలు మాయమవుతున్నాయి. అనుమతుల పేరిట ఇష్టారీతిన మొరం తవ్వకాలు జరుపుతుండటంతో గుట్టలు గుల్లవుతున్నాయి. వందల సంఖ్యలో టిప్పర్ల మొరంను ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ప్రైవేటు వెంచర్లకు తరలిస్తున్నాయి. దీంతో ఒక్కప్పుడు ఇక్కడ గుట్టలు ఉండేవి అనే విధంగా ఆయా ప్రాంతాలు మారుతున్నాయి.

**ప్రైవేటు వెంచర్లకు...**

బాన్సువాడ శివారులోని బోర్లం దారిలో గల గుట్ట సర్వే నంబర్ 357లో 500 టిప్పర్ల మొరం తీసేందుకు కాంట్రాక్టర్ రెవెన్యూ అధికారుల వద్ద అనుమతి తీసుకున్నారు. పట్టణంలోని ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాల వద్ద నూతనంగా నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల కోసం ఈ మొరంను తరలించనున్నారు. కానీ ఇదే అదునుగా చేసుకున్న పిట్లం మండలానికి చెందిన జేసీబీలు, టిప్పర్ల యాజమాని కొన్ని మొరం టిప్పర్లను నర్సింగ్ కళాశాలకు తరలిస్తూ.. మరి కొన్నింటిని ప్రైవేటు వెంచర్లకు తరలిస్తు అక్రమార్జనకు పాల్పడుతున్నాడు. నిర్దేశించిన ప్రకారం కాకుండా ఇష్టారీతిన తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాలు ఎంతమేర తవ్వారనే విషయాన్ని రెవెన్యూ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సి ఉండగా, వారు అటువైపు కన్నెత్తి చూడకపోవడం శోచనీయం. దీంతో ప్రకృతిమయమైన గుట్టలు కనుమరుగవుతున్నాయి. అలాగే గుట్టల పక్కనే ఉన్న కుంటలను మొరంతో పూడ్చి వేసి పాట్లుగా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా కుంటల కింద రైతులు వరినాట్లు వేస్తున్నారు. కుంటలను పూడ్చి వేస్తే మా పంటలను ఎలా రక్షించుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొరం అక్రమ తవ్వకాలను అరికట్టాలని, ప్రకృతి సంపదను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

**అనుమతులు తీసుకున్నారు..**

నర్సింగ్ కళాశాల కోసం కాంట్రాక్టర్ 500 టిప్పుల మొరం కోసం అనుమతులు తీసుకున్నారు. నిర్దేశించిన మేరకే తవ్వకాలు జరపాలి. లేదంటే చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేకుండా మొరం తవ్వకాలు జరిపితే జేసీబీలను, టిప్పర్లను సీజ్ చేస్తాం. కేవలం అభివృద్ధి పనులకే మొరం తరలించాలి. వెంచర్లకు తరలిస్తే చర్యలు తీసుకుంటాం.

–గంగాధర్, తహసీల్దార్, బాన్సువాడ

# పసుపును తవ్వేదెట్లా?

- వేధిస్తోన్న కూలీల కొరత
- గంటల చొప్పున తవ్వకానికి ఆసక్తిచూపుతున్న కూలీలు
- రైతులకు భారమవుతున్న వైనం



రెంజర్ల శివారులో ఉదయం నుంచే పసుపును తవ్వుతున్న కూలీ

బాల్కొండ: ప్రస్తుతం పసుపు తవ్వకాలు జోరందుకున్నాయి. దీంతో పసుపు తవ్వకాలకు కూలీల కొరత తీవ్రంగా ఉంది. ఈక్రమంలో పసుపురైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎకరం పసుపు పంట తవ్వడానికి 20మంది మగ కూలీలు, 40 మంది మహిళ కూలీలు అవసరం ఉంటుంది. రోజంత మగ వారికి పసుపు తవ్వటకు రూ.800 కూలీ ఉంది. మహిళలకు రోజుకు రూ.300 కూలీ ఉంటుంది. ఉదయం 9 గంటలకు వెళ్లి సాయంత్రం 5గంటల వరకు పసుపు తవ్వాలి. మధ్యలో గంట సమయం భోజన విరామం ఉంటుంది. అంటే 7 గంటలు పని చేయాల్సి ఉంటుంది. కానీ రోజంతా పని చేయడానికి కూలీలు ఆసక్తి చూపడం లేదు.

**గంటకు రూ.200 కూలీ..**

గతంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీలు పనిచేసేవారు. ప్రస్తుతం పసుపు తవ్వడానికి కూలీలు గంటల చొప్పున కూలీకి వస్తున్నారు. గంటకు రెండు వందల రూపాయల చొప్పున రైతులు కూలీలకు చెల్లిస్తున్నారు. దీంతో కూలీలు ఉదయం నుంచే పసుపు తవ్వకాలను చేపడుతున్నారు. ఉదయం 6గంటల నుంచి 10 గంటల వరకు తవ్వకాలకు వెళ్తున్నారు. గతంలో రోజంతా పని చేస్తే వచ్చే డబ్బులు ప్రస్తుతం నాలుగు గంటల పనికి వెళ్తే వస్తున్నాయి. దీంతో కూలీలు గంటల చొప్పున కూలీకి ఆసక్తి చూపుతున్నారు. ఈక్రమంలో ఎకరానికి రూ.30 వేలు తవ్వకాలకే అవుతున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఉడికించి, ఆరబెట్టి శుద్ధి చేయడానికి మరింత ఖర్చు అవుతుంది. ఇలా లెక్కిస్తే ఎకరానికి రూ. 40వేల వరకు తవ్వకం నుంచి మార్కెట్‌కు తరలించే వరకే అవుతుందంటు రైతులు ఆవేదన చెందుతున్నారు.

# దేశ సంక్షేమం కోసమే బీఆర్ఎస్ స్థాపన



డబుల్ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

- ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్
- తొర్లికొండలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

జక్రాన్‌పల్లి: తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశ ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ పార్టీని స్థాపించారని టీఎస్ ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పేర్కొన్నారు. మండలంలోని తొర్లికొండలో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ఎమ్మెల్సీ వీజీగౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో రేణుకా ఎల్లమ్మ ఆలయం, క్రీడా ప్రాంగణం, వైకుంఠధామాన్ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో బీజేపీని భూస్థాపితం చేయడం ఖాయమన్నారు. ప్రస్తుతం దేశ ప్రజలు సీఎం కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, తనుజారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ విమల, సర్పంచ్ అక్కపత్రి సురేష్, ఎంపీటీసీ పద్మ, ఉపసర్పంచ్ భూమేశ్వర్, సొసైటీచైర్మన్ అన్వేష్‌రెడ్డి పాల్గొన్నారు.

### సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఒక సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి తెలిపారు. సీఐ కృష్ణ, ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఎస్సై విజయ్ కొండ, ఏఎస్సై రాములు పాల్గొన్నారు.

# హాల్‌మార్క్ బంగారాన్ని కొనాలి



అవినాష్ బాబును సన్మానిస్తున్న బంగారం వెండి వర్తకుల సంఘం ప్రతినిధులు

నిజామాబాద్ సిటీ: ప్రతి వినియోగదారుడు బంగారం కొనుగోలు చేసేముందు హాల్‌మార్క్ ముద్ర ఉంటేనే కొనుగోలు చేయాలని బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్, మినిస్టరీ ఆఫ్ కంజుమర్ అపెక్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియన్ హైదరాబాద్ బ్రాంచ్ శాస్త్రవేత్త, డిప్యూటీ కమిషనర్ అవినాష్ బాబు, ప్రశాంతిలు పేర్కొన్నారు. నగరంలోని మర్చంట్ అసోసియేషన్ భవనంలో బుధవారం ది నిజామాబాద్ గోల్డ్ అండ్ సిల్వర్ మర్చంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హాల్‌మార్క్ జ్యువెలరీ అవగాహన సదస్సు నిర్వహించారు. సమావేశానికి వారు ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. దేశవ్యాప్తంగా హాల్‌మార్క్ కేంద్రాలు 250ఉన్నాయని, నిజామాబాద్‌లో కూడా హాల్‌మార్క్ కేంద్రం ఏర్పాటు చేసుకోవాలన్నారు. హాల్‌మార్క్ పెట్టుకుంటే కలిగే లాభాల గురించి వ్యాపారులకు వివరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మీకాంత్, ప్రధాన కార్యదర్శి పసుల రాజ్‌కుమార్, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

ఖలీల్ వాడి: నగరంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడు. దీంతో విద్యార్థిని తల్లిదండ్రులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతకు ముందు విద్యార్థిని విషయాన్ని తల్లిదండ్రులకు తెలపడంతో వారు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయుడిని నిలదీశారు. దీంతో అక్కడ కొంత వాగ్వాదం జరిగినట్లు తెలుస్తోంది. చివరకు విద్యార్థుల తల్లిదండ్రులు రెండోటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈవిషయమై ఎస్సై పూర్ణేశ్వర్‌ను వివరణ కోరగా విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు టీచర్ అర్విందపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

### ఉత్తర్వులు ఉపసంహరించుకోవాలి

ఆర్మూర్: ప్రభుత్వ ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దని జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలయ్య, రాజన్నలు ఒక ప్రటకలో తెలిపారు. సెలవులు ఇవ్వకూడదని ఉత్తర్వులు జారీ చేయడం నియంతృత్వ పోకడలకు నిదర్శనమని పేర్కొన్నారు.

## క్రైం కార్నర్

# రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



ప్రమాదంలో దెబ్బతిన్న బైక్



మృతిచెందిన పోశెట్టి

మాక్లూర్: మండలంలోని చిక్లీ శివారులోని మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందగా.. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పోశెట్టి (55), సాదు, గంగాధర్ అనే ముగ్గురు వ్యక్తులు బుధవారం ఒకే బైకుపై కొత్తపల్లి నుంచి జన్నెపల్లి సంతకు బయలుదేరారు. మార్గమధ్యలో వీరు చిక్లీ శివారులోని మూలమలుపు వద్ద గల స్తంభానికి ఢీకొని గాయపడ్డారు. స్థానికులు వెంటనే వారిని ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో పోశెట్టి మృతిచెందాడు. మిగిలిన ఇద్దరు చికిత్స పొందుతున్నట్లు తెలిసింది. ఈ ప్రాంతంలో తరచు ప్రమాదాలు జరుగుతున్నందున ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**చెరువులో పడి బాలుడు..**



జగన్‌దాస్ మృతదేహం

బాన్సువాడ టౌన్: పట్టణంలోని కల్కి చెరువులో ఓ బాలుడు ప్రమాదవశాత్తు పడి మృతిచెందినట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా.. ఈ నెల 23న బాన్సువాడ కల్కి చెరువు కట్టపై చెప్పులు ఉండటాన్ని గమనించిన పోలీసులు గుర్తు తెలియని వ్యక్తి చెరువులో పడినట్లు నిర్ధారించి గజ ఈతగాళ్లచే మృతుదేహం కోసం గాలించారు. బుధవారం ఉదయం మృతదేహం లభ్యం కావడంతో పంచనామా కోసం ఆస్పత్రికి తరలించారు. బాలుడి మృతదేహం ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మృతుడి తండ్రి అంబయ్య ఆస్పత్రికి వెళ్లి చూడగా మృతదేహం తన కుమారుడిదేనని గుర్తుపట్టారు. పాఠశాలకు వెళ్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిన జగన్‌దాస్ కల్కి చెరువు కట్టపై ఉన్న బారికేట్లపై కూర్చొని ఉండగా ప్రమాదవవాత్తు చెరువులో పడిపోయి ఉంటాడని, మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని అంబయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

**చికిత్స పొందుతూ ఒకరు..**

బాన్సువాడ రూరల్: విద్యుత్‌షాక్‌కు గురైన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు సీఐ మహేందర్ రెడ్డి బుధవారం తెలిపారు. వివరాలు ఇలా.. మండలంలోని దేశాయిపేట్ గ్రామానికి చెందిన దుర్కికర్ గంగారాం(60) ఎలక్ట్రిషన్ పనులు చేసేవాడు. ఈనెల 24న పోచారం శివారులోని మల్లిక్‌పాషా తన కోళ్లఫారంలో విద్యుత్ మరమ్మతులు కోసం గంగారాంను పిలిచాడు. ఈక్రమంలో ఎజాస్ అనే వ్యక్తి బైక్‌పై అతడిని తీసుకువెళ్లాడు. అనంతరం విద్యుత్ పనులు చేస్తుండగా గంగారాం విద్యుత్‌షాక్‌కు గురైయ్యాడు. స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం బాన్సువాడ ఏరియా అస్పత్రికి తరలించారు. కాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గంగారాం బుధవారం మృతి చెందాడు. తన తండ్రి మృతిపై విచారణ చేపట్టాలని అతని కుమారుడు సత్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు.

### చెరుకు ట్రాక్టర్ బోల్తా



ఎల్లారెడ్డి శివారులో బోల్తా పడిన చెరుకు ట్రాక్టర్

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): పట్టణ శివారులో బుధవారం ప్రమాదవశాత్తు చెరుకు ట్రాక్టర్ బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని కట్టకిందతండా నుంచి నిజాంసాగర్ మండలంలోని మాగి షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును తరలిస్తున్న ట్రాక్టర్ ప్రమాదవశాత్తు బోల్తా పడినట్లు వారు తెలిపారు. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదన్నారు. రోడ్డుపై చెరుకు ట్రాక్టర్ బోల్తా పడడంతో ట్రాఫిక్‌కు కొంత అంతరాయం కలిగింది.

### నాటుసారా స్వాధీనం

సిరికొండ: మండలంలోని తాటిపల్లి గ్రామంలో నాటుసారా తయారు చేస్తున్న మూడు ఇళ్లపై బుధవారం దాడి చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై నర్సింలు తెలిపారు. మాలావత్ దేశాయి, బుక్య దేవులా, బుక్య జయల వద్ద తొమ్మిది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడిలో నిజామాబాద్ డీటీఎఫ్ ఎస్సై గంగాధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రాంకుమార్ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామాల్లో ఎవరైన నాటు సారా తయారు చేస్తే, వారి వివరాలు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై తెలిపారు.

### కారులో పెట్రోల్ పోయించుకొని పరారీ



సీసీ కెమెరాలో రికార్డయిన కారు నంబర్

భిక్కనూరు: సిద్దరామేశ్వరనగర్ శివారులోని జాతీయ రహదారి పక్కన గల పెట్రోలు బంకులో ఓ వ్యక్తి కారు ట్యాంక్ నిండ పెట్రోలు పోయించుకొని డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. హైదరాబాద్ వైపు నుంచి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు (యుపి. 32కెఆర్0077) వాహనం స్థానిక శ్రీవల్లి పెట్రోల్ బంకులోకి వచ్చింది. కారు డ్రైవర్ బంకు వద్ద కారును తీసుకవచ్చి ట్యాంక్ నిండా పెట్రోలు నింపుమని హిందీలో కోరాడు. బంకు సిబ్బంది కారులో సుమారు రూ.4,700 విలువ గల పెట్రోలు పోసి, డబ్బులు అడిగారు. కారు డ్రైవర్ స్వైప్ మిషిన్ తీసుకురమ్మని సిబ్బందికి సూచించాడు. సిబ్బంది స్వైప్ మిషిన్ కోసం వెనక్కి తిరుగగా డ్రైవర్ కారును స్టార్ట్ చేసి, వెళ్లిపోయాడు. బంక్ సిబ్బంది కారును ఆపేందుకు యత్నించగా స్వల్పంగా గాయపడ్డాడు.

### బాలికపై అత్యాచారం కేసులో 20ఏళ్ల జైలు

కామారెడ్డి టౌన్: బాలికపై అత్యాచారం చేసిన ఓ వ్యక్తికి 20 సంవత్సరాలు జైలు శిక్షను విధిస్తూ కామారెడ్డి జిల్లా పోక్సో కోర్టు న్యాయమూర్తి లాల్‌సింగ్ శ్రీనివాస నాయక్ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ నంద రమేష్ తెలిపిన వివరాలు ఇలా.. జిల్లాలోని మద్నూర్ మండలం లింబూర్ గ్రామంలో గ్రామానికి చెందిన జగదీష్ అనే వ్యక్తి 2022 సంవత్సరంలో ఓ బాలికపై అత్యాచారానికి పాల్పడినట్లు మద్నూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టులో న్యాయమూర్తి సాక్షులను విచారించి నిందితుడికి 20సంవత్సరాలు జైలు శిక్ష, రూ.10వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. తెలిపారు. అలాగే బాధితురాలికి రూ.5లక్షలను ప్రభుత్వం నుంచి పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశించినట్లు తెలిపారు.